స్వగృహ ప్రాప్తిరస్తు

- రంగంపేట మండలంలో 4,056 మందికి స్థలాలు
- నెరవేరుతున్న పేదల సొంతింటి కల

రంగంపేట: చక్కగా, సౌకర్యవంతంగా పేదల గూడు ముస్తాబవుతోంది.. నవరత్న పథకాల్లో భాగంగా పేదల సొంతింటి కల సాకారం అవుతోంది. జగనన్న కాలనీల్లో అన్ని వసతులతో గృహాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పేదల మోములో సంతోషం వెల్లివిరుస్తోంది. రంగంపేట మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతుంది. ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలకు తోడు డ్వాక్రా రుణం మరో రూ. 35 వేలు కలుపుకొని పేదలు ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు విడతలుగా రంగంపేట మండలంలో 4,056 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇందులో గృహ నిర్మాణ శాఖ ద్వారా 2,976 మందికి రుణాలు మంజూరయ్యాయి. చంద్రేడు, రంగంపేట, పెదరాయవరం, కోటపాడు, ఎస్టీ రాజాపురం, సింగంపల్లి తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గృహ నిర్మాణ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే రుణంతో పాటు రాయితీపై సిమెంట్, ఇసుక, ఐరన్ కూడా ప్రభుత్వం అందిస్తోంది. ఇంటి పునాదులు పూర్తయితే రూ. 51,200, గోడలు నిర్మిస్తే రూ. 53,200, స్లాబ్ వేసుకుంటే రూ. 22,400, ప్లాస్టింగ్ పూర్తయితే మరో రూ.50 వేలు ఇస్తున్నారు. జగనన్న కాలనీల్లో మెరక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అక్కడ రోడ్ల నిర్మాణం, విద్యుత్తు సరఫరా, తాగునీటి సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంటే.. ఇళ్ల నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు బిజీగా ఉన్నారు.


సింగంపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం

రంగంపేట మండలంలో లబ్ధిదారులు

మంజూరైన ఇళ్ల స్థలాలు	: 4,056
గృహ రుణాల లబ్ధిదారులు	: 2,976
పునాది స్థాయిలో ఇళ్లు	: 173
గోడలు పూర్తయినవి	: 85
మొత్తం పూర్తయిన గృహాలు	: 236
ఇంకా ప్రారంభించనివి	: 586

జగనన్న సహకారంతో..


నా భర్త శ్రీను ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో స్థానిక జగనన్న కాలనీలో ఇచ్చిన స్థలంతో పాటు అందించిన రూ. 1.80 లక్షల రుణంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం.

–పంపన లక్ష్మి, ఎస్టీ రాజాపురం

సొంతింట్లో ఆనందంగా..


నా భర్త వెంకట్ చిరుద్యోగి. ఎప్పటి నుంచో అద్దె ఇంట్లో జీవిస్తున్నాం. జగనన్న చలువతో ఇంటి స్థలం మంజూరైంది. దీంతో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ఆ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే సొంతింట్లో ఆనందంగా జీవిస్తాం. సొంతింటి కల సాకారం చేసిన జగనన్నను సీఎంగా మళ్లీ గెలిపించుకుంటాం.

–కొనిపర్తి వీరవేణి, ఎస్టీ రాజాపురం

గృహ ప్రవేశానికి సిద్ధం


ప్రభుత్వం ఇచ్చిన సాయంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశానికి సిద్ధమవుతున్నాం. సొంతింటి కల నెరవేరడంతో సంతోషంగా ఉంది. పేదలకు ఇంటి నిర్మాణం భారంగా మారిన తరుణంలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుంది. ఈ మేలును ఎప్పటికీ మరిచిపోలేం.

–ముత్యం వీరలక్ష్మి, కోటపాడు

అద్దె బాధలు తప్పాయి


మాకు సింగంపల్లి జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేశారు. గృహ నిర్మాణ రుణం మంజూరు కావడంతో ఇల్లు నిర్మాణం ప్రారంభించి పూర్తి చేసుకున్నాం. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. మా సొంతింటి కల నెరవేరింది. అద్దె ఇంటి బాధలు తప్పాయి.

–సయ్యద్ షబీనాబేగం, సింగంపల్లి

క్లుప్తంగా

వార్డు సభ్యత్వాలకు నేడే ఉప ఎన్నిక


ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్లు సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

అనపర్తి: దుప్పలపూడి పంచాయతీ పరిధి 1, 9వ వార్డు సభ్యత్వాలకు సంబంధించి శనివారం నిర్వహించే ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పోలింగ్ జరుగుతుందని, అనంతరం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఒకటో వార్డుకు గ్రామ పంచాయతీ కార్యాలయం, 9వ వార్డుకు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ నిర్వహించే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా ఒకటో వార్డు పరిధిలో 96 మంది మహిళలు, 110 మంది పురుషులు, 9వ వార్డులో 105 మంది మహిళలు, 101 మంది పురుషులు ఉన్నారు.

లక్ష్మీగణపతి రాబడి లెక్కింపు


బిక్కవోలులో లక్ష్మీగణపతి ఆలయం వద్ద హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని రెండు ఆలయాల్లో శుక్రవారం హుండీల ఆదాయం లెక్కించినట్లు ఆలయ ఈవో రామలింగభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఈ ఏడాది మార్చి 1 నుంచి నేటి వరకూ హుండీల ద్వారా రూ.13,30,383 వచ్చిందన్నారు. గోలింగేశ్వర స్వామి ఆలయంలో మార్చి 29 నుంచి నేటి వరకూ రూ.3,22,505 ఆదాయం సమకూరిందన్నారు. బిక్కవోలు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా మెడికల్ కళాశాల పనులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలని, మరికొద్ది రోజుల్లో వైద్య తరగతులు ప్రారంభం కానున్నా పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందంటూ ఏపీ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి టి.కృష్ణబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను కృష్ణబాబు శుక్రవారం పరిశీలించారు. మెడికల్ కళాశాలకు అనుసంధానంగా నిర్మిస్తున్న వైద్య విద్యార్థుల హాస్టల్స్‌ను పరిశీలించారు. వాటిలో పనులు ఇంకా కొన్ని పూర్తి కాకపోవడంతో వెంటనే వాటిని పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. వైద్య విద్యార్థినుల హాస్టల్స్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని, వైద్య విద్యార్థుల హాస్టల్‌కి గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. బాత్‌రూమ్‌లు బాగా లేవని, వాటిని సరి చేయమని, వాషింగ్ మెషీన్ల విభాగం బాగుండాలని సూచించారు. వైద్య విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. రోడ్లు సరిగా లేవని వారు కృష్ణబాబుకు తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆయన వెంట మెడికల్ కళాశాల హెచ్‌వోడీ పీవీవీ.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, ఆర్‌ఎంవో డాక్టర్ మనోజ్ ఉన్నారు.

విశ్వకర్మ యోజన అద్భుతం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్రమోదీ విశ్వకర్మ యోజనకు రూ.13 వేల కోట్లు కేటాయించడం అద్భుతమైన విషయమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ హర్షం ప్రకటించారు. శుక్రవారం నగరంలో జిల్లా బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా నాయకులు థ్యాంక్యూ మోదీ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయిరామ్ మాట్లాడుతూ దేశ సాంస్కృతిక జీవన విధానంలో విశ్వకర్మలది ప్రధాన భూమిక అనే విషయాన్ని గుర్తించే నాయకత్వం బీజేపీలో ఉందన్నారు. ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్ మాట్లాడుతూ మొదట విడతలో 18 సంప్రదాయ వృత్తులకు విశ్వకర్మ యోజనను వర్తింపజేస్తారన్నారు.

యువకుడిపై పోలీసు వేధింపులు

కడియం: మండలంలో వడ్డే వెంకటప్రసాద్ అనే యువకుడిపై పోలీసులు వేధింపులకు పాల్పడ్డారని ఆ యువకుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రేమ వ్యవహారానికి సంబంధించి వెంకటప్రసాద్ తన మోటారు సైకిల్‌ను ఇచ్చి సహకరించాడని పోలీసులు చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రసాద్‌ను స్టేషన్‌కు పిలిచి హింసించారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రసాద్ తీవ్ర అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. దీనిపై దక్షిణ మండలం డీఎస్పీ కె.శ్రీనివాసులును వివరణ కోరగా కడియం పోలీసు సిబ్బంది నిబంధనల మేరకే వ్యవహరించారన్నారు. వెంకట ప్రసాద్‌ను హింసించారనడం సరికాదని వివరించారు.

అధ్యాపక పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జంతుశాస్త్ర అధ్యాపకుడి పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంఎస్సీ జువాలజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 19వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న గాడాల పీఠాధిపతి

మధురపూడి: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం గాడాలకు చెందిన శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వర స్వామి పీఠాధిపతి డాక్టర్ చిన్న వెంకన్నబాబు దర్శించుకున్నారు. కొండ కింద గల స్వామివారిని, కొండపైన కొలువు దీరిన స్వామిని కూడా దర్శించుకున్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

మధురపూడి: మణిపూర్‌లో దాడులు, వేలాది మందిని హత్యకు గురైన నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని బీఎస్పీ తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ ఇసకపట్ల రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మధురపూడి విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడారు. దేశం సిగ్గుపడేలా మహిళలను వివస్త్రలుగా చేయడం దుర్మార్గం అన్నారు. ఈ ఘటనలకు ప్రధానమంత్రి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మతతత్వాన్ని ప్రేరేపించే దురుద్దేశంతో బీజేపీ వ్యవహరిస్తోందన్నారు.

నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: పేరొందిన కంపెనీలలో ఉద్యోగావకాశాలను అందుకోవాలంటే అందుకు అవసరమైన నైపుణ్యాలు మీలో ఉండాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సీఎస్‌ఈ, బిట్ క్లబ్ ఆధ్వర్యంలో 'అప్ స్కిల్స్' అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, డీన్ డాక్టర్ పి.సురేష్‌వర్మ, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ వి.పెర్సిస్, హెచ్‌ఓడీ డాక్టర్ బి.కేజియా రాణి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.దాసు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత


అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక అచ్చియ్యపేటలో అగ్నిప్రమాద బాధితులను శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. అచ్చియ్యపేటలో పెద్దకాపు సత్యవతికి చెందిన పెంకుటిల్లులో ఇటీవల గ్యాస్ లీకై అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం బాధితులను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు బియ్యం, కూరగాయలను అందజేశారు. రెవెన్యూ అధికారులు బాధితులకు 20 కేజీల బియ్యం, కందిపప్పును అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, మంగరౌతు దుర్గ శ్రీనివాస్, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, బిజ్జి రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ ఎంత పెద్ద నేరమో తెలుసుకోవాలి


బహుమతి ప్రదానోత్సవంలో డీన్ శ్యామ్‌రాజ్‌నాయక్

రాజమహేంద్రవరం రూరల్: కళాశాలల్లో ర్యాగింగ్ చేయడం ఎంత పెద్ద నేరమో తెలిసేలా విద్యార్థులకు వారం రోజుల పాటు అవగాహన కల్పించామని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజ్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కాతేరులోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వరకు నిర్వహించిన జాతీయ ర్యాగింగ్ నిరోధక ముగింపు వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. వారం రోజులుగా ర్యాగింగ్ వలన కలిగే దుష్పలితాలు వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా యూజీసీ (న్యూఢిల్లీ) తయారు చేసిన వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధకత, ర్యాగింగ్ చట్టాలపై మానసిక వైద్య నిపుణులు, పోలీసు అధికారులతో అవగాహన కల్పించామన్నారు. యాంటి ర్యాగింగ్‌పై ఆరు రోజులుగా నిర్వహించిన పలు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశామన్నారు.

పథకాలతో పేదల ఇంట వెలుగులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో గడప గడపకూ..


జి.మామిడాడలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల ఇంటికి వెలుగు వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మఒడి, రైతు భరోసా తదితర పథకాలు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదల ఇంటి వద్దకే పథకాలు అందిస్తూ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారన్నారు. రాష్ట్రంలో ఒకేసారి 32 లక్షల ఇళ్ల స్థలాలను పేదలకు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడు ఇళ్లు నిర్మించుకునే విధంగా ప్రభుత్వం ఆర్థిక సహాయం కూడా అందిస్తుందన్నారు. తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ లంక మున్ని, ఎంపీటీసీ సభ్యురాలు కేతా సత్యశ్రీలక్ష్మి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలు ధ్వంసం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం, రఘుదేవపురం లంకభూములలో పంటపొలాలను గేదెలు ధ్వంసం చేశాయి. శుక్రవారం సీతానగరానికి చెందిన రైతుల పంటపొలాల్లోకి గేదెలు చొరబడి ధ్వంసం చేశాయి. ఇనుంటివారిపేట, ముగ్గళ్లకు చెందిన రైతుల గేదెలను లంక భూములలో వదిలేశారని, అక్కడ నుంచి రఘుదేవపురం, సీతానగరం లంకభూములలోకి వచ్చి అరటి, వరి, జామతోటలు, నారుమళ్లను గురువారం రాత్రి గేదెలు ధ్వంసం చేశాయని సీతానగరానికి చెందిన రైతులు మట్ట శ్రీను, మట్ట నాగేశ్వరరావు, చినవరపు నాగేశ్వరరావు, జొన్నల పెద్దబ్బులు, సంగిశెట్టి సీతారామయ్య, కోరసిక దుర్గయ్య, బోయిన దుర్గాప్రసాద్, జగత హరికృష్ణ తదితరులు తెలిపారు. గేదెల కోసం గాలిస్తున్నామని, వాటిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగిస్తామని వారు తెలిపారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మంటపంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని మండల అఖిల భారత చిరంజీవి యువత తెలిపింది. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 22న సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

భక్తుల మన్ననలు పొందాలి


పాలకమండలితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భగవంతునికి, ఆయన భక్తులకు సేవ చేసుకునే మహాభాగ్యం అందరికీ రాదని, పాలకవర్గం నిస్వార్థంగా పనిచేస్తూ భక్తుల మన్ననలు పొందాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ కోరారు. శుక్రవారం నగరంలోని ఆర్యాపురం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం, సత్యనారాయణ స్వామి పుట్టిన రోజు (సత్య విదియ) కలిసి రావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. పాలకమండలి చైర్మన్‌గా దుంగా మంగాలక్ష్మి, సభ్యులుగా బిల్లపాటి శ్రీనివాస్, జగన్నాథం, రఘుపాత్రుని సాయిబాబు, బాసరబోయిన విజయ శంకర్, సాగర్ల దిలీప్ హర్ష, రేగుళ్ళ అన్నపూర్ణ, చొక్కాకుల వెంకట రమణి, సంసాని దుర్గ, పానంగిపల్లి వెంకటగోపాలరవిబాబు (అర్చకులు)తో ఎంపీ భరత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం చేసే అభివృద్ధి పనులతో ఆలయ కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింప జేయాలని, ఆలయ చరిత్రను వెబ్‌సైట్ లో పొందుపరచాలని సూచించారు. ఎంపీ భరత్, వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరిలకు ఆలయ మర్యాదలతో, మేళతాళాలు, బాణసంచాతో స్వాగతం చెప్పారు. ఈఓ ఎస్. సత్యవాణి, రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పంతం కొండలరావు, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ, ఖాదీ బోర్డు వైస్ ప్రెసిడెంట్ పిల్లి నిర్మల, పాలిక శ్రీను, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నగర బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, నగర యువజన విభాగ అధ్యక్షుడు పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

ఆలయాల్లో సామూహిక వ్రతాలు


చంద్రేడులో వరలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు


అనపర్తి శాంతిపురంలో మహాలక్ష్మి అమ్మవారు


పెదపూడి లక్ష్మీగణపతి ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు


వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ

పెదపూడి: శుభంకరీ.. వరలక్ష్మీ నమోస్తుతే అంటూ అమ్మవారిని ఆ భక్తజనం కొలిచింది.. శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పెదపూడి మండలంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. పెదపూడిలోని లక్ష్మీగణపతి సహిత సరస్వతీదేవి ఆలయం వద్ద మహిళలు సామూహిక వరలక్ష్మీ పూజలు చేశారు. సిరి సంపదలు ఇచ్చే మహాలక్ష్మిని పూజించి అమ్మవారి అనుగ్రహం పొందారు. అర్చకుడు మోహన్‌శర్మ ఆధ్వర్యంలో కాకర వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పూజలు జరిగాయి. జి.మామిడాడ, సంపర, పెద్దాడ, రామేశ్వరం, కాండ్రేగుల తదితర గ్రామాల్లోని ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

బిక్కవోలు: మండలంలో పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. బిక్కవోలు, కొమరిపాలెం, తొస్సిపూడి, పందలపాక, కొంకుదురు తదితరుల చోట్ల ఆలయాల్లో వరలక్ష్మీ పూజలు జరిగాయి.

రంగంపేట: శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా మండలంలో ఇంటింటా వరలక్ష్మీ వ్రతాలు చేసుకున్నారు. పలు రకాల పండ్లు, పిండి వంటలు, వివిధ రకాల పత్రిలతో అమ్మవారిని పూజించారు. చంద్రేడులోని అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

అనపర్తి: స్థానిక శాంతిపురంలోని గణపతి, సరస్వతి సహిత మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రాంబాబు శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిపారు. పాతవూరు శివాలయంలో ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

వరలక్ష్మీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ కనకదుర్గమ్మ శుక్రవారం వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర శ్రావణమాసంలో మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథ శర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- తిరుమలాయపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం


తిరుమలాయపాలెంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. తొలుత గ్రామంలోని అప్పన్నబాబును ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, పురంశెట్టి పెదబాబు, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

తిరుమలాయపాలెంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.